
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 • కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

సోమవారం 11 ఆగస్టు 2025

అంతు పట్టని..
గువ్వల వ్యూహం

- బాలరాజు పార్టీ మార్పుపై తర్జన భర్జనలు
- కేటీఆర్, కేసీఆర్‌లపై నేరుగా విమర్శనాస్త్రాలు
- మాజీ మంత్రి రాములుకు తనకు మధ్య వివాదాలు సృష్టించింది బీఆర్ఎస్ అధిష్ఠానమే
- ఆదివారం కమలం గూటికి చేరిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయాలు అనేక ఆసక్తికర పరిణామాలకు దారి తీస్తున్నాయి. రెండుసార్లు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా కొనసాగిన గువ్వల బాలరాజు అనూహ్యంగా పార్టీ మారడం పట్ల అనేక రాజకీయ విశ్లేషణలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీని మారే క్రమంలో కేసీఆర్, కేటీఆర్‌లను ఉద్దేశించి గువ్వల బాలరాజు చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. మోయినాబాద్ ఫామ్‌హౌజ్ ఘటనలో తనను పావుగా వాడుకున్నారని, కేసీఆర్ పాలమూరు నుంచి ఎంపీగా నిలబడిన క్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి తనకు టికెట్ కేటాయించారు. కానీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన గెలుపునకు ఎలాంటి చొరవ చూపకుండా రాజకీయంగా భ్రష్టు పట్టించారని గువ్వల బాలరాజు దుయ్యబట్టడం గమనార్హం.



గువ్వల అసలు వ్యూహమేమిటో?

భారత రాష్ట్ర సమితిలో కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న గువ్వల బాలరాజు ఆకస్మికంగా ఆ పార్టీని వీడడం అనేక రాజకీయ విశ్లేషణలకు తావిస్తోంది. మరో మూడేళ్ల దాకా అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఎన్నికలు వచ్చే పరిస్థితి లేదు. రాజకీయంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తెలంగాణలో బలమైన క్యాడర్‌ను కలిగి ఉన్నాయి. ఈ క్రమంలో గువ్వల బాలరాజు రెండు పార్టీలను కాదని కమలం గూటికీ చేరడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మోయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు ఎపిసోడ్‌లో గువ్వల బాలరాజు బీజేపీని ప్రధాన ముద్దాయిగా పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో గువ్వల బాలరాజుతోపాటు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కూడా కీలకంగా కన్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ వ్యవహారం కొంతకాలం పాటు వెనక పడింది. కేంద్రంలో తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎవరైతే తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై భారతీయ జనతా

(మిగతా 6లో..)

ట్రాఫిక్ జామ్

జూరాల ప్రాజెక్టుపై రెండు గంటల పాటు నిలిచిన రాకపోకలు

అమరచింత, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టుపై రెండు గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. ఉదయం ఐదు గంటలకే క్రేన్ సహాయంతో ఎగువ జూరాల జల విద్యుత్ ప్రాజెక్టు గేట్లను ఎత్తే పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం 5 గంటల నుంచి సుమారు 8 గంటల వరకు దాదాపు రెండు గంటలకు పైగా క్రేన్ సహాయంతో గేట్లను ఎత్తినట్లు సమాచారం. దీంతో గద్వాల, ఆత్మకూర్, మక్తల్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పనులు ముగిసిన వెంటనే క్రేన్‌ను అక్కడి నుంచి తరలించడంతో వాహనాలు ముందుకు సాగాయి. రాఖీ పండుగకు వచ్చిన ప్రజలు తిరిగి స్వగ్రామాలకు వెళ్లే వాహనాలతో పాటు ఆదివారం కావడంతో పర్యాటకులు సైతం ప్రాజెక్టుపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



జూరాల ప్రాజెక్టుపై భారీగా నిలిచిన వాహనాలు

ఎక్కడికి వెళ్తున్నారు ?

- జోగులాంబ గద్వాల జిల్లాలో పెరుగుతున్న మిస్సింగ్ కేసులు 7
- గత ఏడాదిలో 198 కేసులు నమోదు
- ఈ ఏడాది ఇప్పటివరకు 105 కేసులు
- మృత్యువాత పడుతున్న కొందరు

పేకాట స్థావరంపై
పోలీసుల దాడి

- ఎనిమిది మంది అరెస్టు, పరారీలో 13 మంది
- 21 మోటార్ సైకిళ్లు స్వాధీనం 6

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

- 70 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో, 68 వేల క్యూసెక్కులు ఔట్ ఫ్లో



కర్నూల్ జిల్లా డోన్ పట్టణంలో జరిగిన రిసెప్షన్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో జోగుళాంబ ఆలయ అర్చకులు (ఫైల్)

జోగుళాంబ ఆలయ అర్చకులకు
దేవాదాయశాఖ నోటీసులు

- నిబంధనలకు తిలోదకాలు
- ఈనెల 6న డోన్‌లో ఓ నేత సోదరుడి కూతురి రిసెప్షన్‌లో ఆశీర్వచనాలు
- విషయం బయటకు రానీయకుండా జాగ్రత్తలు 6

పేదలకు పెన్నిధి
సీఎం సహాయ నిధి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి పథకమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని తన నివాసంలో రూ. 38,21,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులను అందించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీ లేనివారికి సైతం అత్యవసర చికిత్స కోసం ఎల్‌వోసీలు, సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులతో ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో చిన్నారెడ్డి



బ్రహ్మగిరిలో వనమహోత్సవానికి వెలుతున్న మహిళలు

రామన్‌పాడు
ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

మదనాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని రామన్‌పాడు ప్రాజెక్టుకు సంబంధించి రెండు గేట్లను ఆదివారం ఎత్తారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చే వరద కాకుండా శంకరసముద్రం నుంచి వరద రావడంతో రెండు గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ వరప్రసాద్ తెలిపారు.



రామన్‌పాడు ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వస్తున్న నీరు

నల్లమలలో
వనమహోత్సవం

- లింగమయ్యస్వామికి భక్తుల ప్రత్యేక పూజలు

బ్రహ్మగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతం బ్రహ్మగిరిలో ఆదివారం భక్తులు ఘనంగా వనమహోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అందరు సాముహికంగా లింగమయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు.

ఇంకెన్నాళ్లు వరదలో..
ప్రయాణం

- నిధులు మంజారైనా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- 350 మీటర్ల బ్రిడ్జికి రూ.30 కోట్లు మంజూరు



ఉప్పునుంతల మండలంలోని మొల్గర- ఉల్పర కాజ్‌వేపై వరద ప్రవాహంలో నడుస్తున్న ప్రయాణికుడు 6

రైల్వే అండర్ బ్రిడ్జిలు

- చిన్నపాటి వర్షాలకే నిండిపోతున్న ఆర్‌యూబీలు
- ఇంకుడు గుంతల నిర్మాణంలో లోపాలే కారణం
- రోజుల తరబడి ఇంకిపోని వర్షపు నీరు
- వానాకాలంలో వాహనదారుల ఇబ్బందులు



మానవపాడు : నారాయణపురం నుంచి హైవేకు వెళ్లే దారిలోని ఆర్‌యూబీలో నిలిచిన వర్షపు నీటిని తోడేస్తున్న దృశ్యం

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వాహనదారుల ప్రయాణ సౌకర్యార్థం రైల్వే గేట్ల స్థానంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ల నిర్మాణం చేపట్టారు. వర్షం పడిన ప్రతీ సారి ఆర్‌యూబీలు నిండిపోతున్నాయి. దీంతో ట్రాక్ దాటేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌యూబీలకు అనుసంధానంగా సమీపంలో భారీ ఇంకుడు గుంతలు నిర్మించారు. ఆర్‌యూబీలలో చేరిన నీరు ఈ ఇంకుడు గుంతల్లోకి వెళ్లేందుకు భూమిలో పైపులు ఏర్పాటు చేశారు. కానీ ఆవసరమైన లోతు నిర్మించకపోవడం వల్ల కొద్దిపాటి వర్షానికే ఇంకుడు గుంతలు నిండి పోవడంతో ఆర్‌యూబీలు నిండిపోతున్నాయి. దీంతో వాహనదారులకు కష్టాలు తప్పడంలేదు.

ప్రయాణ కష్టాలు కనరా..?

రైల్వే గేట్ల వద్ద చేపట్టిన ఆర్‌యూబీల నిర్మాణాలు ప్రయాణికులకు మాత్రం కొత్త కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని తిమ్మాపూర్ నుంచి ఏపీలో డోన్ వరకు ఐదేళ్లలో 54 ఆర్‌యూబీలు నిర్మించారు. ఇక రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)లు 12 ఉన్నాయి. ఇంకుడు గుంతల నిర్మాణాల్లో లోపాల కారణంగా కొత్త సమస్యలు తెచ్చి పెడుతున్నాయి. ఆర్‌యూబీలకు అనుసంధానిస్తూ ఇంకుడుగుంతలు నిర్మించారు. చిన్నపాటి వర్షాలకే ఇంకుడు గుంతలు నిండిపోవడంతో ప్రయాణానికి అంతరాయం ఏర్పడుతోంది.

నీటిని తోడేస్తేనే దారి..

ఆర్‌యూబీల వద్ద నిలిచిన నీటిని తోడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కాంట్రాక్టర్లను నియమించింది. ఈ కాంట్రాక్టర్లు సకాలంలో రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి మానవపాడు మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఆర్‌యూబీ దాటి వెళ్లాలి. రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి ఆర్‌యూబీ నిండిపోయింది. దీంతో ప్రయాణికులు చెన్నిపాడు మీదుగా 30కిలోమీటర్ల దూరం ప్రయాణించి మానవపాడు చేరుకున్నారు. గ్రామ యువకులు, రైతులు కాంట్రాక్టరును పిలిపించి నీటిని ఎత్తిపోశారు. నారాయణపూరం, పెద్దదిన్నే, వల్లూరు తదితర చోట్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.



వర్షపు నీటితో కెనాల్‌ను తలపిస్తున్న నారాయణపురం ఆర్‌యూబీ

పాపను కలిసేందుకు వస్తే..



నా ఇద్దరు కూతుళ్లు మానవపాడులోని కేజీబీవీ పాఠశాలలో చదువుతున్నారు. ఆదివారం పిల్లలను చూసొద్దామని బయలుదేరాను. కానీ రైలుకట్ట వద్ద నీరు నిలిచిందని ఆటో తిరగకపోవడంతో నడుచుకుంటూనే మానవపాడు వెళ్తున్నా.

-సంధ్య వీరాపురం గ్రామం, గద్వాల మండలం

తమ్ముడికి రాఖీ కట్టేందుకు..



మానవపాడులో ఉన్న నా తమ్ముడు రాకేష్‌కు రాఖీ కట్టేందుకు వచ్చాను. కానీ ఇక్కడ నీళ్లు ఉండటంతో ఆటోలు తిరగడంలేదు. దీంతో నడుచుకుంటు వచ్చాను. బంధువుల బైక్ సాయంతో ఇంటికి చేరుకోవాలి. మళ్లీ వర్షం వస్తే బ్రిడ్జి నిండిపోతుందేమో వెంటనే రాఖీ కట్టి తిరిగి వెళ్లిపోతాను.

- భువనేశ్వరీ డోన్, కర్నూలు జిల్లా

నేడు బల్మూరులో మంత్రుల పర్యటన

బల్మూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేయడానికి రాష్ట్ర మంత్రులు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రామాజీపల్లి, వీరం రామాజీపల్లి, కొండనాగుల గ్రామాలను కలుపుకుని బీటీ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. కొండనాగులలో మధ్యాహ్నం 2గంటలకు సీసీ రోడ్డు శంకుస్థాపన, 2:30గంటలకు గ్రామపంచాయతీ భవనం, 2:45గంటలకు కొండనాగుల గ్రామంలో బీఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవిలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అచ్చంపేటకు మంత్రి వివేక్ వెంకటస్వామి రాక

అచ్చంపేట టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉపాధి, కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్‌వెంకటస్వామి నేడు అచ్చంపేట నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలో మునిసిపల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం బల్మూర్ మండల పరిధిలోని రామాజీపల్లి గ్రామంలో సీసీ రోడ్ శంకుస్థాపనలతో పాటు కొండనాగుల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

» సైకిల్ యాత్ర చేపట్టిన ఆంధ్ర యువకుడు

చారకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా మైదుకూరు మండలం బస్వాపురం గ్రామానికి చెందిన యువకుడు కార్తీక్‌రెడ్డి ఫిబ్రవరి 6, 2025 రోజున తన ఇంటి నుంచి 'సేవ్ ట్రీ-సేవ్ ఎర్త్' అనే నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టాడు. సైకిల్ యాత్ర చేపట్టిన కార్తీక్‌రెడ్డి ఆదివారం చారకొండ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం తన సైకిల్ యాత్ర కొనసాగుతుందని అన్నారు. మొక్కలు కాలుష్య నివారణకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. మానవాళి మనుగడ కోసం చెట్లు చాలా అవసరమని అన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, గోవా, ఒడిశా రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర కొనసాగించి 4,200 కిలోమీటర్లు పూర్తి చేశానని, ఇంకా భారత్‌లోని మిగతా రాష్ట్రాల్లో తిరిగి పర్యావరణంపై ప్రజల్లో చైతన్యపరిచి తన సైకిల్ యాత్ర ముగిస్తానని తెలిపారు. అనంతరం చారకొండ నుంచి నల్గొండ జిల్లా దేవరకొండ వైపు తన సైకిల్ యాత్ర కొనసాగించారు.



విలేకరులతో మాట్లాడుతున్న యువకుడు కార్తీక్‌రెడ్డి

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» ఎనిమిది మంది అరెస్టు, మరో 13 మంది పరారీ

» 21 మోటార్ సైకిళ్లు స్వాధీనం

గద్వాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలం పూడూరులో డబ్బులు పెట్టి బొమ్మ, బొరుసు ఆడుతుండగా ఆదివారం మధ్యాహ్నం గద్వాల రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. పకడ్బందీగా దాడులు చేసినప్పటికీ ఎనిమిది మంది మాత్రమే పోలీసులకు చిక్కారు. మరో 13మంది పరారయ్యారు. ఇందుకు సంబంధించిన గ్రామస్థులు, ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో కొన్నినెలల నుంచి పేకాట, బొమ్మా, బొరుసు(కాయిన్ ఎగరవేసే ఆట) ఆడుతున్నారు. రూ.వేలు, లక్షల్లో బెట్టింగ్ చేస్తున్నారు. వీటిని ఆడేందుకు గ్రామస్థులే కాకుండా ఇతర గ్రామాల నుంచి రావడం మొదలుపెట్టారు. గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించే వాళ్లు వీరిని ప్రోత్సహిస్తున్నారు. ఆదివారం గ్రామం చివరలో ఒక టీ బంక్ దగ్గర పేకాట, బొమ్మాబొరుసు ఆడుతున్నారని పోలీసుకు పక్కా సమాచారం అందింది. దాదాపు 15మందితో కూడిన పోలీస్‌బృందం అక్కడి కి వెళ్లింది. పోలీసులను చూడగానే అందరూ పరారయ్యారు. అతికష్టం మీద ఎనిమిది మందిని పట్టుకున్నారు. వీరివద్ద నుంచి రూ.7100 నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు లభ్యమయ్యాయి. అక్కడ నిలిపి ఉంచిన దాదాపు 21 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని డీసీఎం, ట్రాక్టర్‌లో స్టేషన్‌కు తరలించారు.

గౌరారంలో పాముల కలకలం

» ఒకే దగ్గర ఐదు పాములు


గౌరారంలో రైతు బాలపీర్ పొలంలో కనిపించిన పాములు

తెలకపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గౌరారం గ్రామంలో పాములు కలకలం రేపాయి. ఒకే దగ్గర ఐదు పాములు ఉండడంతో రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. బాలపీర్ అనే రైతు పొలంలో ఆదివారం మధ్యాహ్నం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. అక్కడ పైపును లేపడంతో ఐదు పాములు అందులో నుంచి కిందపడ్డాయి. దాంతో అతను భయభ్రాంతులకు గురై పక్కనే ఉన్న రైతులను కేకలు వేసి పిలిచారు. దీంతో అందరు కలిసి ఆ పాములు విషపూరితమైనవి కావడంతో చంపినట్లు రైతులు తెలిపారు.

బైకు అపహరణ : కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బైక్ అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్‌కు చెందిన శ్రీరామ్ తన వాహనాన్ని రోడ్డు పక్కన పార్కు చేసి వ్యవసాయ పంట పొలాల్లోకి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను అపహరించుకునిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

అంతు పట్టని గువ్వల వ్యూహం

(5వ పేజీ తరువాయి..)

పార్టీలో కీలకంగా సంస్థాగత వ్యవహారాలు చూసే బీఎస్.సంతోష్ పట్ల ఉదాసీనంగా వ్యవహరించడంపై అమిత్‌షాతో సహా కేంద్ర నాయకత్వం రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు, అధ్యక్షులపై సీరియస్ అయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గువ్వల బాలరాజు బీజేపీలో చేరే అంశం మొదలైందని మొత్తం ఘటనలో మిగతా వారందరినీ పార్టీలో చేర్చుకునేందుకు అత్యున్నత స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అచ్చంపేట బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్?

గువ్వల బాలరాజు బీజేపీలో చేరిన అచ్చంపేట నియోజకవర్గంలో బలమైన నేతను రంగంలోకి దించే క్రమంలో బీఆర్ఎస్ దిద్దుబాటు చర్యలను చేపట్టింది. గువ్వల బాలరాజు పార్టీని వీడనున్నారనే క్రమంలో వచ్చిన వార్తల నేపథ్యంలో దిద్దుబాటు చర్యలను చేపట్టిన బీఆర్ఎస్ గత నాలుగు రోజుల నుంచి అచ్చంపేటలో ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలందరినీ రంగంలోకి దించింది.

నియోజకవర్గంలో బలమైన క్యాడర్ గువ్వల బాలరాజు వెంట వెళ్లకుండా ఆ పార్టీ నియంత్రించగలిగింది. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన అచ్చంపేటకు గువ్వల బాలరాజు పార్టీ వీడిన తర్వాత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నియమించాలనే అంశంలో ఆ పార్టీలో ఏకాభిప్రాయం కుదిరింది. అచ్చంపేట నియోజకవర్గంతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అనుబంధం ఉంది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తల్లి ప్రేమమ్మ, తండ్రి సవారన్న ప్రభుత్వ టీచర్లుగా అమ్రాబాద్ మండలంలో దాదాపు 20 ఏళ్ల పాటు పని చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రాథమిక విద్యాభ్యాసం 5వ తరగతి వరకు వెంకటేశ్వర్లబావిలో, 6 నుంచి 7వ తరగతి వరకు నడింపల్లిలో కొనసాగింది. అచ్చంపేట నియోజకవర్గంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బలమైన అనుబంధం ఉండడంతో బీఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అచ్చంపేట ఇన్‌చార్జిగా నియమించాలని దాదాపు నిర్ణయించింది. అధికారికమైన ప్రకటన వెలువడాల్సి ఉంది.

మాజీ మంత్రి రాములుకు నాకు విబేధాలు అంటగట్టారు..

బీజేపీలో చేరే క్రమంలో అనేక వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఆర్ఎస్ అధిష్ఠానం మాజీ మంత్రి రాములు, తన మధ్యన కూడా అఘాతాన్ని సృష్టించి రాజకీయంగా ప్రయోజనం పొందాలని చూసిందని ఆరోపణ చేశారు. వాస్తవానికి ఇరువురి మధ్య ఎలాంటి అపోహాలు లేవని, బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న నేతల మధ్య పరస్పర అఘాతం సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలనే యోచన బీఆర్ఎస్ అధిష్ఠానానికి ఉందని గువ్వల బాలరాజు బాహాటంగా పేర్కొన్నారు. ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఉమ్మడి పాలమూరులో మోస్తరు వాన

నారాయణపేట/ మద్దూరు/ నాగర్‌కర్నూల్/ వనపర్తి/ రేవల్లి/ గద్వాల/ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా కోస్గి మండలంలో 65.0 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా దామరగిద్ద మండలంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మద్దూర్ మండలంలో 49.5, కొత్తపల్లిలో 38.8, మరికల్‌లో 14.0, కృష్ణ మండలంలో 9.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఊట్కూర్‌లో 9.3, మక్తల్‌లో 8.3, గుండుమాల్ 7.8, మాగనూర్‌లో 4.0, ధన్వాడ, 4.0, నారాయణపేట మండలంలో 3.0 మిల్లీమీర్ల వర్షపాతం నమోదయ్యింది. మద్దూర్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రెనివట్ల - పెదిరిపాడ్‌ల మధ్య కొత్త ఎస్‌బీఐ వరకు వరకు నివాస ప్రాంతాలు జలమయం అయ్యాయి.


జలకళను సంతరించుకున్న నారాయణపేట మండలం శ్యాసన్‌పల్లి చిన్నోని చెరువు

కొన్ని ఇళ్లలోకి నీరు చేరింది. ఆ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వర్షపు నీరు అదే ప్రాంతంలో నిలిచింది.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు 9.84 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కల్వకుర్తి మండలంలో 29.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా తిమ్మాజిపేట, చారకొండ మండలాల్లో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కొత్తపల్లిలో 29.2, కొల్లాపూర్‌లో 20.0, పెంట్లవెల్లిలో 16.0, బిజినేపల్లిలో 13.0, తెల్కపల్లిలో 10.2, నాగర్‌కర్నూల్‌లో 9.6, లింగాలలో 8.6, ఊర్కొండలో 7.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తాడూరు, అచ్చంపేట, అమ్రాబాద్, పదర, బల్మూరు మండలాల్లో వర్షం పడలేదు.

● వనపర్తి జిల్లాలో మూడు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. చిన్న చెరువులు, కుంటలు నిండాయి. వాగులు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలోని రేవల్లి మండలంలో అత్యధికంగా 34.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

అమరచింతలో 20.2, వీపనగండ్లలో 15.4, ఘనపూర్‌లో 12.2, పానగల్‌లో 10.4, పెద్దమందడిలో 3.6, పెబ్బేరులో 2.4, ఆత్మకూర్‌లో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మదనాపూర్, శ్రీరంగాపూర్, చిన్నంబావిలో మండలాల్లో వర్షం పడలేదు. జిల్లా వ్యాప్తంగా సగటున 7.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

రేవల్లి మండల కేంద్రం నుంచి తలుపునూరు గ్రామానికి వెళ్ళే రహదారి కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కేశంపేట వాగు పొంగిపొరలుతుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు కాలినడకన వాగు దాటి వెళ్తున్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండు రోజులుగా వర్షం కొనసాగుతోంది. ఎర్రవల్లిలో 27.3 మిల్లీ మీటర్లు, ధరూర్‌లో 25.1, గద్వాలలో 15.6, అలంపూర్‌లో 10.9, మానవపాడులో 10, ఇటిక్యాలలో 4.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఇంకెన్నాళ్లు వరదలో ప్రయాణం

» నిధులు మంజూరైనా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్

» 350 మీటర్ల బ్రిడ్జికి రూ.30 కోట్లు మంజూరు

ఉప్పునుంతల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వచ్చిందంటే దుందుభీలోని కాజ్‌వే దాటాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటాల్సిందే. ఉప్పునుంతల- వంగూర్ మండలాల సరిహద్దులో ప్రవహిస్తున్న దుందుభీ వాగు పరిసర ప్రాంతాలైన మొల్గర- ఉల్పర కాజ్‌వేపై వర్షాకాలంలో ఎప్పుడూ వరద ప్రవాహం కొనసాగుతుంది. ఈ మార్గం ద్వారా అచ్చంపేట నుంచి కల్వకుర్తి వయా హైదరాబాద్, హైదరాబాద్ నుంచి అచ్చంపేట నిరంతరం వాహనాలు రవాణ కొనసాగిస్తుంటాయి. అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఈ మార్గం ద్వారా ప్రయాణం చేస్తే సుమారు 15 కి.మీ. దూరం తగ్గుతుందని ఈ మార్గం ద్వారా ప్రయాణికులు ప్రయాణం కొనసాగిస్తుంటారు. వానాకాలంలో కాజ్‌వే పై ప్రయాణ చేస్తూ ఎంతో మంది ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. కాజ్‌వేపై వరద ఉధృతి ప్రవాహం ఉన్న సంగతి తెలియక వాహనాలు రాకపోకలు కొనసాగించి నీటి ప్రవాహంలో ఆటోలు, బైక్‌లు కొట్టుకపోయిన సంఘటనలు ఉన్నాయి. అంతే కాక ప్రయాణికులు కాలినడకన కాజ్‌వే దాటడానికి వెళ్లి కింద పడిపోయినట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వంగూర్-ఉప్పునుంతల అనుసంధానం చేసే దుందుభీ వాగులో 350 మీటర్ల బ్రిడ్జి నిర్మాణానికి గతంలో 30 కోట్లు నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తి ఏళ్లు గడుస్తున్నా నేటికీ బ్రిడ్జి నిర్మాణం పనులు మాత్రం ప్రారంభించడంలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకొని మొల్గర- ఉల్పర వద్ద దుందుభీ వాగులో బ్రిడ్జి నిర్మాణం చేసి నియోజకవర్గ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు చేపట్టాలి

నాలుగు, ఐదు ఏళ్ల కిత్రం బ్రిడ్జి నిర్మాణం కోసం అనుమతులు వచ్చి, టెండర్ ప్రక్రియ పూర్తి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు వర్షాకాలంలో కాజ్‌వే దాటానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. తర్వగా బ్రిడ్జి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి.

- కొత్త రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

త్వరలోనే బ్రిడ్జి పనులు ప్రారంభిస్తాం

వరద ప్రవాహం తగ్గి పనులు ప్రారంభించడానికి అవకాశం ఉంటే తర్వలోనే బ్రిడ్జి పనులు చేపడుతాం.

- లక్ష్మీపతి, ఆర్అండ్‌బీ ఏఈ

ఘనంగా మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలు

కొల్లాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను కొల్లాపూర్ మండలంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కేక్ కట్ చేసి పేదలకు చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో మాజీ కౌన్సిలర్ మేకల శిరీష కిరణ్ యాదవ్ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు నేతృత్వంలో పట్టణంలో జూపల్లి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు, నోటు పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు.


కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మునిసిపల్ మాజీ కౌన్సిలర్ మేకల శిరీష

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణమ నాయుడు , కిరణ్ యాదవ్, బోరెల్లి మహేష్, కిషోర్ యాదవ్, కేతూరి ధర్మతేజ, శేఖర్, సతీష్, అల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో పాదయాత్ర

మహమ్మదాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నంచర్ల గేట్ చౌరస్తా నుంచి మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వరకు ఆదివారం బీజేపీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. యాత్ర నంచర్ల, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మంగంపేట మొకర్లబాద్ మీదుగా మహమ్మదాబాద్ వరకు సాగింది. ఈ సందర్భంగా మండల కేంద్రలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, రాములు, వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పరిగి నియోజక వర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్, భూనేటి మాట్లాడారు. మండల అధ్యక్షుడు నరసింహ, నాయకులు కుర్వకృష్ణ, మల్లేష్ నాయకులు కార్యక్తలు పాల్గొన్నారు. ఈ యాత్ర కలెక్టరేట్ వరకు నిర్వహించి ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నారు.


కలెక్టరేట్‌కు పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

» 70 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో » 68 వేల క్యూసెక్కులు ఔట్ ఫ్లో


సుంకేసుల డ్యాం నుంచి విడుదల అవుతున్న వరద నీరు

రాజోలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రాజోలి శివారులోని సుంకేసుల డ్యాం సందే సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవుదినం కావడం సుంకేసుల జలాశయానికి నిండుగా వరదనీరు రావడంతో డ్యాంను సందర్శించేందుకు అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. ఆదివారం ఉదయం డ్యాంకు ఎగువ నుంచి 72వేల క్యూసెక్కులు వస్తుండటంతో డ్యాంలో 16 గేట్ల ద్వారా 69వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి వరద కాస్త తగ్గి 70వేల క్యూసెక్కులు వస్తుండటంతో దిగువకు 68,000 క్యూసెక్కుల వరదను దిగువకు వదిలేస్తున్నట్లు డ్యాం జేఈ తెలిపారు. ఈ నీటిని చూసేందుకు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో డ్యాంలో సందడి నెలకొంది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.00 మీటర్లు నీటిమట్టం నమోదయినట్లు తెలిపారు.

అలుగు పారుతున్న చెరువులు, కుంటలు


భారీ వర్షాలకు అలుగు పారుతున్న పాలెం పెంటోని చెరువు

బిజినేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు ఆలుగు పారుతున్నాయి. వానాకాలం ఆరంభం నుంచే విస్తారంగా వర్షాలు కురవడంతో పాలెంలోని పెంటోని చెరువు, ఖానాపూర్ పెద్ద చెరువు, బిజినేపల్లిలోని సాకలోని చెరువు, ఆయా గ్రామాల్లోని కుంటలు ఆలుగులు పారడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి వానాకాలం ఆరంభంలోనే కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవడంతో పంటల సాగుకు నీటి సమస్య ఉండదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు అక్కడక్కడా రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ


మేడిపూర్‌లోని కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారిపై హైలెవల్ వంతెన కింద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

తాడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రవహిస్తున్న దుందుభీ నది మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. మేడిపూర్‌లోని కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారిపై ఉన్న హైలెవల్ వంతెన కింద నుంచి నది ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. ప్రధానంగా సిర్సవాడ వద్ద ప్రవహిస్తున్న దుందుభీ నదిలో లోలెవల్ కాజ్‌వే పూర్తిగా దెబ్బతిన్నందున రాకపోకలు నిలిచిపోయాయి. అన్నదాతలు, గీత కార్మికులు నది దాటేందుకు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాత్కాలికంగా అయిన రాకపోకలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాగులపై వంతెనలు నిర్మించాలి


ఉధృతంగా పారుతున్న వాగు

కోడేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వాగులపై వంతెనలు నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు. శుక్ర, శని వారాలలో కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల పరిధిలోని బావాయిపల్లి, తిరుమలాపూర్ మధ్యలో బావాయిపల్లి వాగు కోడేరు, పసుపుల మధ్య వాగు కానాపూర్, సాతాపూర్, జొన్నలబొగుడ వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు లేకపోవడంతో ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఈ వాగులపై కొన్నేళ్లుగా అధికారులకు వినతిపత్రాలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ. 95 లక్షలు మంజూరయ్యాయని, ఆ తరువా ఆరు కోట్లు మంజూరయ్యాయని, టెండర్ కూడా కాంట్రాక్టర్‌కు ఇచ్చారని, శిలాఫలకం వేసి వదిలేశారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి వంతెనల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

జోగుళాంబ అర్చకులకు దేవాదాయశాఖ నోటీసులు

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బాలబ్రహ్మేశ్వర ఆలయ అధికారులు, అర్చకులు రాజకీయాలతో అంటకాగుతున్న అపవాదు ఉండనే ఉంది. తాజాగా ఆ వ్యవహారాన్ని నిజం చేస్తూ మరి కొంతమంది అర్చకులు దొరికిపోయారు. ఈ నెల 6న ఏపీలోని డోన్ పట్టణంలో స్థానిక ముఖ్య నేత అన్న కూతురు, ఏపీ మాజీ వైసీపీ మంత్రి బుగ్గన రాజేందర్‌రెడ్డి కుమారిడి వివాహంలో భాగంగా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఇదే వేడుకలో వధూవరులకు ఆశీర్వచనలు ఇస్తూ అలంపూరు ఆలయాల అర్చకులు చమక్కుమన్నారు. జోగుళాంబ అమ్మవారి ఆలయ ప్రముఖ అర్చకులు వెంకటకృష్ణస్వామి, విక్రాంత్‌శర్మ, కృష్ణమూర్తిలు ఈ వేడుకకు హాజరై పురోహితం చేశారని, ఇది దేవదాయశాఖ నిబంధనలకు విరుద్ధమని సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి. పైగా వారు అర్చక వృత్తిరీత్య వేషాధారణలో ఉంటూ వధూవరులకు ఆశీర్వచనలు ఇస్తున్న వీడియోలు ప్రసారం అయ్యాయి. వీటన్నింటిని పరిశీలించిన దేవదాయశాఖ కమిషనర్ నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు అర్చకులకు నోటీసులు జారీ చేశారు. చట్టవిరుద్ధ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొన్నారో వివరణ ఇవ్వాల్సిందిగా కోరినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ఆంధ్రజ్యోతితో మాట్లడుతూ.. నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమేనని, ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనరాదని నూతన నిబంధనలు అందుబాటులో ఉన్నాయని, కానీ వాటిని ఉల్లంఘించి ఆశీర్వచనలకు వెళ్లారని, వారు ఇచ్చే సమాధానంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ విద్యుత్ లైన్‌మన్ మృతి



రాము (ఫైల్)

బిజినేపల్లి, భూత్పూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగనూర్ గ్రామ విద్యుత్‌శాఖ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న దొడల రాము యాదవ్ (46) చేగుంట గేట్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామానికి చెందిన మృతుడు రాముయాదవ్ కొంతకాలంగా మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారం రోజుల క్రితం విధులు ముగించుకొని మహబూబ్ నగర్‌కు బైక్ వెళ్తున్న మృతుడు రాముయాదవ్ భూత్పూర్ మండలం ఆల వెంకటేశ్వర్ రెడ్డి కాలనీ సమీపంలోని చేగుంట గేట్ సమీపంలో బైక్ ఆదుపుతప్పి కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో బిజినేపల్లి ఏఈ వెంకటేష్, సిబ్బంది దుస్స సైదులు, విల్సన్, తిరుపతయ్య, లోకేష్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఏడు నెలల గర్భవతి కావడంతో పాటు కూతురు ఉన్నారు. ఈఘటనపై మృతుడి తండ్రి బాలకిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గోపాల్‌పేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఏదుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏదుట్ల గ్రామానికి చెందిన బుద్దుల నాగోశి(32), భాగ్యలక్ష్మి కూలీ పనులు చేసకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. నాగోశి కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. గత నెల 30న తాగడానికి డబ్బులు కావాలని భార్యను, తల్లి సాయమ్మను అడుగగా.. వారు ఇవ్వకపోవడంతో క్షణికావేశంతో ఇంట్లో ఉన్న పురుగు మందును తాగాడు. కాసేపటి తర్వాత ఇంటి ముందు వాంతులు చేసుకుంటుండగా.. భార్య భాగ్యలక్ష్మి చూసి వనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. నాగోశిని వైద్యులు పరిశీలించి వెంటనే మహబూబ్‌నగర్ ఆసుపత్రికి పంపించారు. నాగోశి అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలియజేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కొంకల గ్రామంలో యువకుడు..



సురేశ్‌గౌడ్ (ఫైల్)

వడ్డేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండల పరిధిలోని కొంకల గ్రామానికి చెందిన సురేశ్ గౌడ్(20) కుటుంబ సభ్యులతో ఆర్థిక వ్యవహారాల విషయంలో గొడవపడ్డాడు. ఈక్రమంలోనే జూలై 12న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం రాయచూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ఊర్కొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఊర్కొండకు చెందిన కర్నె కృష్ణయ్య బైకుపై మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి గుండా పెట్రోల్ బంకు వైపు వెళుతుండగా రాచాలపల్లి గేటు వద్ద బైకును వెనకాల నుండి బొలెరో వాహనం ఢీకొట్టడంతో గాయాలైనట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఉరుములకు ముగ్గురికి గాయాలు

మల్దకల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామంలో కూలీ పనికి వచ్చిన వారిపై మెరుపు మెరిసింది. దీనికి విద్యుత్‌షాక్‌కు గురై ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు.. ఐజ గ్రామానికి చెందిన కూలీలు రోజువారీగా పెద్దొడ్డి గ్రామానికి కూలి పనికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వచ్చిన వర్షానికి కూలీలు పక్కనే ఉన్న డీసీఎం దగ్గరకు వెళ్లారు. మెరుపులకు డీసీఎం డ్రైవర్, విజయ్, చరణ్, ముగ్గురు కూలీలు గాయపడ్డారు. వారిని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు.

ఢీ కొన్న రెండు కార్లు.. ప్రయాణికులపై దూసుకెళ్లి ఐదుగురికి గాయాలు

మూసాపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 44వ జాతీయ రహదారి వేములస్టేజీ వద్ద రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ఐదుగురు గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం వివరాల్లోకి వెళ్లగా.. వేముల గ్రామానికి చెందిన యాదయ్య యాదవ్‌కు సంబంధించిన కుటుంబ సభ్యులు, చెల్లెలు రాఖీ పండుగ సందర్భంగా అన్న యాదయ్యకు రాఖీ కట్టి తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లడానికి వేములస్టేజీ వద్దకు వచ్చి బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. అదే సమయంలో తాళ్లగడ్డ నుంచి కారు వేముల గ్రామానికి వెళ్లడానికి రోడ్డు క్రాస్ అవుతుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టి రోడ్డుపై నిలబడి ఉన్న శ్రీశైలం, సరిత, సంగీత, నాగమణి, యాదమ్మపై దూసుకెళ్లింది. దీంతో వీరంతా తీవ్రంగా గాయపడటంతో చికిత్సకై అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఇరుకుగా మారడంతో తరచుగా ప్రమాదాలు..

వేములస్టేజీ వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మాణంలో భాగంగా పనులు కొనసాగడంతో రోడ్డు ఇరుక్కుగా మారి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు జరిగే చోట వాహనాలు వెళ్లడానికి రోడ్డు ఇరుక్కు చేసి ఇరువైపులా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయడంతో శనివారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సంగు వెంకటయ్య అనే వ్యక్తి దిమ్మె తగిలి కిందపడి మృతి చెందాడు. ఆదివారం వేముల స్టేజీ వద్ద బస్సుల కోసం రహదారిపై నిలబడి ఉన్న ప్రయాణికులపైకి సైతం రెండు ఢీకొట్టి దూసుకెళ్లడంతో ఐదుగురు గాయపడ్డారు. అదే విధంగా 500 అడుగుల దాకా ఇరువైపులా గంటకోసారి వాహనాలు స్తంభించడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత పనుల గుత్తేదారు సరియైన అవగాహన లేకపోవడంతో రోడ్డు క్రాసింగ్‌ను తమ ఇష్టారాజ్యంగా మార్చడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పనులు సైతం సకాలంలో పూర్తి చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన కుర్వ రంగస్వామి

రాజోలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాజోలిలోని ఫిల్టర్ ట్యాంక్ వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజోలికి చెందిన కుర్వ రంగస్వామి పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా గ్రామంలోని ఫిల్టర్ ట్యాంక్ వద్ద గుర్తు తెలియని కారు రాజోలి నుంచి కర్నూలు వైపు వెళ్తూ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రంగస్వామికి కాలు విరిగింది. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. కారును శింగవరం సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇష్టారీతిన పంచేశారు..!

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ పక్కన మటన్ వ్యాపారం
- వరుసగా దుకాణాల ఏర్పాటు
- ఐదు ఫీట్ల వెడల్పు, 10 ఫీట్ల పొడవు స్థలాన్ని కొలతలు పెట్టి పంచిన నాయకులు
- దుకాణాలను తొలగించాలని కోరుతున్న ప్రజలు



జడ్చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీకి ఆనుకొని 167వ జాతీయరహదారి పక్కన ఏర్పాటు చేసిన మటన్ దుకాణాలు

జడ్చర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోనే ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ కళాశాల అది. ఆ కళాశాలకు ప్రహరీ నిర్మాణం ఉంది. ఇటీవల చించోలి నుంచి కోదాడ వరకు జడ్చర్ల మీదుగా 167వ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. నిర్మాణంలో భాగంగా రోడ్డుకిరువైపులా డ్రైనేజీలను నిర్మించారు. కళాశాల ప్రహరీ నుంచి డ్రైనేజీ మీదుగా ఆ స్థలం దాదాపు 10 ఫీట్ల పొడువుకు పైగా ఉంటుంది. ఎంతో విలువైన ఆ స్థలంపై అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల కన్ను పడింది. వీరిలో స్థానిక కౌన్సిలర్‌లు సైతం పాలుపంచుకోవడం విశేషం. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మటన్ వ్యాపారులకు తలా 5 ఫీట్ల వెడల్పు, 10 ఫీట్ల పొడవు కలిగిన స్థలాన్ని ఇష్టానుసారంగా కొలతలు వేసి మరీ పంచేశారు. ఇదేంటని ప్రశ్నించిన నాథుడే లేకపోవడంతో యథేచ్ఛగా మటన్ వ్యాపారుల వ్యాపారం మూడు పొట్టేళ్లు... ముప్పై కిలోల మాంసం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రముఖ కళాశాలల స్థాయిలో పేరున్న జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉందని సోయి మరిచారు. విద్యాసంస్థ పక్కన మటన్ వ్యాపారులకు పోటాపోటీగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు స్థలాన్ని పంచేశారు. విద్యాసంస్థలకు సుమారు వంద మీటర్ల దూరంలో మద్యం, మాంసం వ్యాపారాలు ఉండాలన్న నిబంధనలను అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తుంగలో తొక్కారు. వ్యాపారులకు పంచేసిన స్థలంలో పక్కా నిర్మాణాలు జరుపుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. కొందరు మటన్ వ్యాపారం చేపడ్తుంగా, మరికొందరు చిన్న పాటి హోటల్స్‌ను నడుపుతున్నారు. ఈ హోటల్స్‌లో చికెన్, మటన్ తెచ్చిచ్చిన వారికి వండిపెట్టడంతో పాటు అక్కడే సిట్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.

చిన్నపాటి ప్లాస్టిక్ కవర్‌లతో సిట్టింగ్ కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆ ఏర్పాటులో మద్యం తాగుతూ మాంసం తినేలా సౌకర్యం ఏర్పాటు చేయడంతో అత్యధికంగా యువత ఆ చిన్నపాటి హోటల్స్‌ను ఆశ్రయిస్తున్నారు.

వారంతా ఆ హోటల్స్ ముందే, రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఆ దారి గుండా వెళ్లే స్థానికులు, సమీప కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంతో విలువైన స్థలాన్ని కాపాడాల్సిన రాజకీయ పార్టీల నాయకులు, అందుకు భిన్నంగా వ్యవహరించిన తీరుపై పట్టణ ప్రజలు పలు రకాల విమర్శలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీకి ఆనుకుని 167వ జాతీయరహదారి పక్కన ఏర్పాటు చేసిన మటన్ దుకాణాలు, ఇతర దుకాణాలపై పలు ఫిర్యాదులు అందాయి. దుకాణాలతో డబ్బాలు సైతం ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులలో పేర్కొన్నారు. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

\- లక్ష్మారెడ్డి, మునిసిపల్ కమిషనర్

విగ్రహాలు ఏర్పాటు చేస్తాం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీకి ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు, డబ్బాలను తొలగిస్తాం. వారితో సమావేశం నిర్వహించి, చర్యలు తీసుకుంటాం. ఆ స్థలంలో మహాత్ముల విగ్రహాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విధంగా విగ్రహాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

\- పుష్పలత, మునిసిపల్ చైర్‌పర్సన్

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను శాలువాతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజలను హామీల పేరుతో తప్పుదోవ పట్టించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా పర్యటన అనంతరం హైదరాబాద్ వెళ్తున్న ఆయన ఆదివారం మునిసిపాలిటీ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్‌లో బీఆర్ఎస్ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదవులు అనుభవించి తమ రాజకీయ స్వప్రయోజనాల కోసం ఇతర పార్టీలకు వెళ్లినా.. ఒరిగేది ఏమీలేదన్నారు. పార్టీ మారే వారివెంట కార్యకర్తలు, నాయకులు వెళ్లకుండా బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. దీంతో బీఆర్ఎస్‌ను వీడాలి అంటే నాయకుల్లో వణుకు పుడుతుందన్నారు. అనంతరం ఆయన్ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్ రెడ్డి, కర్రెస్వామి, వెంకటేష్, శివ శంకర్‌గౌడ్, సాయినాథ్, ఎల్లారెడ్డి, శాంతన్న, సహదేవుడు, శేఖరాచారి, రఘు తదితరులున్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి అఖండజ్యోతి ఉత్సవాలు



మద్దూర్‌లో అఖండజ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న తొగుటవీర క్షత్రియులు



కత్తి విన్యాసాలు చేస్తున్న యువకులు

- నాలుక, చెంపలకు ఇనుప చువ్వలు గుచ్చుకున్న భక్తులు

మద్దూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తొగుట వీర క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి అఖండ జ్యోతుల ఉత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శివారులోని అమ్మవారి ఆలయం నుంచి అలంకరించిన అఖండ జ్యోతిని ప్రధాన మార్గం గుండా స్థానిక పాత బస్టాండ్ బొడ్రాయి వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ జ్యోతులను నెత్తిన బూని దేవి నామస్మరణ గీతాలు ఆట పాటలతో ఊరేగించారు. పలువురు భక్తులు ఇనుప చువ్వలను, నాలుక, చెంపలకు గుచ్చుకొని భక్తిని చాటారు. యువకులు కత్తి విన్యాసాలు చేశారు. ఉత్సవం అనంతరం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. విఠల్, నర్సింహులు, మహాదేవ్, బాల్‌రాజ్, బుచ్చయ్య, శ్రీనివాస్. బాల్‌రాజ్, సిద్దు, విజయ్, ప్రవీణ్, నవీణ, బాల్‌రాజ్, మహిపాల్ పలువురు పాల్గొన్నారు.

ఎక్కడికి వెళ్తున్నారు..?

- జోగుళాంబ గద్వాల జిల్లాలో పెరుగుతున్న మిస్సింగ్ కేసులు
- గత ఏడాదిలో 198 కేసులు నమోదు
- ఈ ఏడాది ఇప్పటివరకు 105 కేసులు
- మృత్యువాత పడుతున్న కొందరు..



గద్వాల క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో మిస్సింగ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా యువతులు, మైనర్లు, యువకులతో పాటు వివాహిత మహిళలు ఎక్కువగా మిస్సవుతున్నారు. ఎందుకు అదృశ్యం అవుతున్నారో తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నా పుణ్యకాలం కాస్తా పూర్తవుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు యువతులు పెళ్లి చేసుకొని రావడం, కొందరు యువకులు మృత్యువాతపడడం జరుగుతూనే ఉన్నట్లు తెలుస్తున్నది.

తీరా అంతా అయిపోయాక పోలీస్ స్టేషన్లకు వారంతట వారే వచ్చేదాకా పోలీసులు గుర్తించలేకపోతున్నారు.

గత ఏడాదిలో 198 కేసులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాది 2024లో మొత్తం 198 కేసులు, 2025 జూలై వరకు 105 కేసులు మొత్తం 303 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. వెలుగులోకి రానివి మరికొన్ని ఉన్నాయి. 2024లో 190 కేసులు, 2025లో 105 కేసులను ఛేదించినట్లు పోలీసుల రికార్డుల ద్వారా తెలుస్తున్నది. కానీ ఇంట్లో నుండి బయటకు వచ్చిన వారు ఎలా మిస్సవుతున్నారో, ఏటా కేసులు పెరగడానికి గల కారణాలు ఏమిటో అంతుచిక్కడం లేదు. ఈ ఏడాది జూన్ 17న గద్వాల పట్టణంలోని కిష్టారెడ్డిబంగ్లా కాలనీకి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజవర్ధన్ మిస్సయిన రోజే హత్యకు గురవడం కలకలంరేపింది. జిల్లాలో కొందరు మైనర్ బాలికలు మిస్సింగ్ కావడం, వెంటనే వారిని బలవంతంగా వివాహం చేసుకోవడం కూడా చోటుచేసుకున్నాయి.

పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం



జిల్లాలో మిస్సింగ్ కేసుల విషయంలో ప్రత్యేక నిఘా ఉంచాము. మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే, బాధితుల మొబైల్‌ను ఆధారంగా చేసుకొని ట్రేస్ చేస్తున్నాం. ఎవరెవరితో మాట్లాడారు? ఎక్కడెక్కడ తిరుగుతున్నారో విచారణ చేస్తాము. త్వరగా పట్టుకునేందుకు కృషి చేస్తున్నాం.

\- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

పెన్షనర్ల సమస్యలపై నేడు హైదరాబాద్‌లో మహాధర్నా

పాలమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల సాధనకు 11వ తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేసీ వెంకటేశ్వర్లు, పి.వెంకటస్వామిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎన్నికలకు ముందు పెన్షనర్లకు ఎన్నో ఆశలు చూపి అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవటం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫేస్టోలో పొందుపరిచిన విధంగా పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన 15 రోజుల్లో ఆరోగ్యపథకం పూర్తి చేసి ప్రకటిస్తామని, పది రోజుల్లో మూడు డీఏలు, డీఆర్‌లు ఏరియర్స్‌తో సహా ఏకమొత్తంగా చెల్లిస్తామని, ఆరు నెలల్లో మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీలు ఏమైనవని ప్రశ్నించారు.

మహాధర్నాలో కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాలో పెన్షనర్లు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

- జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలి
- జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. హనుమాన్ కరాటే అసోషియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ ట్రోఫీ నిర్వహించారు. ఎన్పీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి టోర్నీ నిర్వహించడం పట్ల మాస్టర్ వెంకటేశ్‌ను అభినందించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, క్రీడా సంఘాల ప్రతినిధులు సురేష్, బాల్‌రాజ్, హనుమాన్ కరాటే అసోషియేషన్ ఫౌండర్ వెంకటేశ్, నాయకులు నర్సింహులు, డి.నర్సింహులు, మాస్టర్లు నబీ, ఫయాజ్, సలాం, అనిల్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా గ్రామ యువకులు



అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామ యువకులు

ఊర్కొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న యువకుడికి అండగా నిలిచిన గ్రామ యువకులను పలువురు అభినందించారు. మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన ఎండీ మౌలానా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి చేరుకున్నాడు. దాంతో బాధితుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ యువకులు రూ.84 వేలను అందించారు. ఆపదలో ఆదుకొని అండగా నిలిచిన యువకుల సేవ భావాన్ని ఆ గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు ఉన్నారు.

మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తులకు కొంగు బంగారంగా వెలిసిన మైసమ్మ దేవతను భక్తులు ఆదివా రం దర్శనం చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి కాకుండుఆ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 15వేల మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి టికెట్ల ద్వారా 57,270, హుండీ ద్వారా రూ.48,690 మొత్తం రూ.10,5960 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

న్యూస్ బాక్స్

రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కందనూలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఈనెల 13వ తేదీలోపు 2025 పాలసీ సంవత్సరానికి రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.యశ్వంత్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా జూన్ 5వరకు పట్టా పాస్ పుస్తకం వచ్చిన రైతులు, ఇంత వరకు రైతు బీమా చేసుకోని రైతులు మాత్రమే రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా రైతు బీమా నమోదు చేసుకోవడానికి దరఖాస్తు ఫారం, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్, రైతు ఆధార్ జిరాక్స్, నామినీ ఆధార్ జిరాక్స్ సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా ఏఈవోకు అందజేయాలన్నారు.

● వంగూరు : రైతు బీమా పథకానికి అర్హత గల రైతులు ఈనెల 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న రైతులు అర్హులని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, గుంతకోడూరు, అల్లాపూర్, పొల్మూరు, ఆకునెల్లికుదురు, మేడిపూర్, గుట్టలపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీరాములు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎన్ఎంఆర్ఐటీ రాష్ట్ర అధ్యక్షుడు అనుపటి రమేష్ ముదిరాజ్

తిమ్మాజీపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బాధిత నిరుపేద కుటుంబాలకు నీలం మధన్న ముదిరాజ్ యువసేన అండగా ఉంటుందని ఎన్ఎంఆర్ఐటీ రాష్ట్ర అధ్యక్షుడు అనుపటి రమేష్ ముదిరాజ్, కాంగ్రెస్ ఐటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపటి రమేష్ ముదిరాజ్ అన్నారు. తిమ్మాజీపేట మండల కేంద్రానికి చెందిన కావలి రాజు కవితల కుమారుడికి సుందెలుక కరవడం చేయికి ఇన్‌ఫెక్షన్ కావడంతో ఆపరేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న ఆయన ముదిరాజ్ సంఘం సభ్యులతో కలిసి ఆదివారం కావలి రాజు ఇంటికెళ్లి మధన్న యువసేన ద్వారా రూ. పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. ముదిరాజ్ మహాసభ మండల కమిటీ అధ్యక్షుడు కావలి లక్ష్మయ్య, డీఎఫ్‌సీఎస్ జిల్లా డైరెక్టర్ ఆవుల ఈశ్వర్, నాయకులు వెంకటేశ్, రఘు, వెంకన్న, బాలు, శివ, జగదీష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన బాలయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆర్థిక సహాయం సమకూర్చారు. దీంతో ఆదివారం ఆ గ్రామ బీఆర్ఎస్ నాయకులు సూర్యప్రకాశ్‌రావు స్థానిక నాయకులతో కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య, లక్ష్మయ్య, నాగేంద్రం, నాగిరెడ్డి, వెంకటేశ్, పరశురాములు, జంగయ్య, మల్లేష్ ఉన్నారు.

కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ వత్తాసు

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : దేశ సంపదను దోపిడీ చేస్తున్న కార్పొరేట్ శక్తులు దేశం విడిచి వెళ్లాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి అధ్యక్షతన ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశాన్ని లూటీ చేస్తున్న కార్పొరేట్ శక్తులకు మోదీ నాయకత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్రీ ట్రేడ్ ఒప్పందంపై భారత్ ఒప్పందం చేసుకోకూడదని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు శివరాం, రైతులు ఈశ్వర్, విజయ్ పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్



కాల్వలు లేక పారుతున్న మురుగు

- **నెల్లికొండలో అస్తవ్యస్తంగా డ్రైనేజీలు**
- **అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు**
- **మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం**

కందనూలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : విలీన గ్రామం అస్తవ్యస్తంగా మారింది. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డు నెల్లికొండ, నాగనూల్ గ్రామాలు సమస్యల వలయాల్లో చిక్కుకున్నాయి. నెల్లికొండ గ్రామంలో ప్రధాన రహదారిలో మాత్రమే అంతర్గత డ్రైనేజీ నిర్మించారు. గ్రామంలో లేక మురుగునీరు అంతా రోడ్లపై పారుతూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న మరో కాలనీలో చెత్త తీయక చెత్తాచెదారంతో పేరుకుపోయింది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ దోమలతో కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. గ్రామంలో దళితవాడ బీసీ వాడల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేక కాలనీవాసులు సతమతమవుతున్నారు. చినుకు పడిన చిత్తడి చిత్తడితో బయటకు రాకుండా నర కయాతన అనుభవిస్తున్నట్లు కాలనీవా సులు పేర్కొన్నారు. గ్రామంలో సక్రమంగా వీధి దీపాలు లేక చీకటిపడితే బయటకు వెళ్లాలంటే భ యమేస్తుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.



గ్రామంలో రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

అంతర్గత రోడ్లు నిర్మించాలి



నెల్లికొండ గ్రామంలో అంతర్గత రోడ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై పారుతోంది. అవస్థలు పడుతున్నాం. కాలనీలో సమస్యలతో సతమతమవుతున్నాం.

- శ్రీదేవి, నెల్లికొండ

అంతర్గత డ్రైనేజీ నిర్మించాలి



గ్రామంలో అంతర్గత డ్రైనేజీ లేక రోడ్లపై మురుగునీరు పారుతున్నాయి. అంతర్గత రోడ్లు నిర్మించి పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి. పాతగేరిలో అంతర్గత రోడ్లను నిర్మించాలి.

- కుర్మయ్య, నెల్లికొండ

ఘనంగా మంత్రి జూపల్లి జన్మదినం



పెద్దకొత్తపల్లిలో మంత్రి జూపల్లి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ దండు నరసింహ

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రవికుమార్, మాధవి అశోక్‌రెడ్డి, ఆది ధర్మేందర్, బద్యనాయక్, శశికళ, శివశంకర్, పెద్దకొత్తపల్లి మండల యూత్ ప్రెసిడెంట్ పగడాల నాగబాబు, మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గడ్డిగోపుల ఎల్లయ్య, యువ నాయకులు బ్యాగరీ మల్లేష్, రామస్వామి, సాయి, శ్రీను, తిరుపతి, శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

పెంట్లవెల్లి : పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆదివారం 160 మంది విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మ తేజ, కాంగ్రెస్ నాయకులు ఎర్ర శ్రీను, కోట్ల సు రేందర్, ఖాజామైనుద్దీన్, దొబ్బలి రేణు, ఆసిఫ్, కుమార్, రవి, లాయర్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేసి...

కోడేరు : ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం పురస్కరించుకొని ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ముందు కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొడెండ్ల సురేష్, మాజీ వార్డు సభ్యుడు ఆదిరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దూరెడ్డి రవీందర్ రెడ్డి, ఎల్లారెడ్డి, నాగచైనీ బ్యారం, నాగయ్య, జేసీబీ రమేష్, చామంతి రాజు, తిరుపతయ్య, సాయి రాంరెడ్డి, రామచారి పాల్గొన్నారు.

45వ నూలు పూర్ణిమ ఉత్సవాలు



ఇంటర్‌మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : 45వ నూలు పూర్ణిమ ఉత్సవాలు ఆదివారం పట్టణంలో మార్కండేయ కమ్యూనిటీ హాల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు వనం కౌశిక్ 986 మార్కులు సాధించారు. గంజి శ్రీ హర్షితతో పాటు ఎల్లికంటి కీర్తన, ఏలే జశ్వంత్ అదే విధంగా నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన అరుణ్‌తేజను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు పులిజాల శ్రీనివాసులు మాట్లాడుతూ 45వ నూలు పూర్ణిమ ఊరేగింపు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కోట కిశోర్, రవీందర్, సత్యనారాయణ, సుధాకర్, మల్లికార్జున్, కృష్ణయ్య, రమేష్, పర్వతాలు, శంకుతల పాల్గొన్నారు.

మైసమ్మ దేవస్థానంలో సమస్యలపై ఈవోకు ఫిర్యాదు



ఏఈఈవోకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఆదివారం జరిగే నాయినోనిపల్లి మైసమ్మ దేవస్థానంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు ఆధ్వర్యంలో ఆదివారం ఎండోమెంట్ ఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో అవకతవకలు జరుగుతున్నాయని వాటిపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని బీజేపీ నాయకులు కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనే చాలా ప్రజాదరణ పొందిన నాయినోనిపల్లి మైసమ్మ దేవస్థానం దర్శనానికి ప్రతీ ఆదివారం వేలాదిమంది భక్తులు వస్తున్నారని కానీ ఈ దేవస్థానంలో రాజకీయ నాయకులు ఒత్తిడికి తలొగ్గి దేవస్థానం పవిత్రతను, వసతులను కాపాడకుండా అవినీతికి నిలయంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. దేవాలయం ఆవరణలో మహిళలకు మరుగుదొడ్ల వ్యవస్థ సరిగ్గా లేక మహిళా భక్తులు బహిర్భూమికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు విచారం వ్యక్తం చేశారు. జాతరలో ధరలు, నాణ్యత విషయంలో పర్యవేక్షణ లేక అనుమతులు లేని తినుబండారాలను అమ్ముతూ ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతూ భక్తులను నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. దేవాలయం హుండీ లెక్కింపులో ప్రామాణికత ఉండడం లేదని భక్తులకు దర్శనం టికెట్లు ఇచ్చే విషయంలో చాలా అవినీతి జరుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్య క్షుడు దేశమోని పరశురాముడు, జిల్లా కౌన్సిల్ మెంబరు మేకల శివ, ప్రధాన కార్యదర్శి పిల్లి నాగరాజు, సాతాని శ్రీను, గువ్వలి వెంకటయ్య, పదిర భీమేష్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గుండాల శివ, పూజారి చంద్రశేఖర్, బద్దుల ప్రవీణ్‌యాదవ్, బీసమోని లింగస్వామి, కోట్ల సుధాకర్‌రావు, శ్రీకాంత్, అమ్మపల్లి మల్లేష్, మద్దిలేటి, మేకల శివ, సోషల్ మీడియా కన్వీనర్ కృష్ణారావు, సారాయి శేఖర్, విజయ్, కృపేందర్, రాజులు, మెరుగు రాజు, బంటుపల్లి శివ, గడ్డిగోపుల శివశంకర్, శ్రావణ్, మధు, జోగేందర్ ఉన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్



మాట్లాడుతున్న నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి కుల వృత్తి లేని వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రధాన కార్యదర్శి కృష్ణమ నాయుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం ఇక్కడ జరిగిన పెద్దకొత్తపల్లి మండల స్థాయి కార్య కర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వాల్మీకి బోయలు తమ హక్కుల సాధన కోసం భవిష్యత్తులో నిర్వహించే పోరా టాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. అనం తరం పెద్దకొత్తపల్లి మండల వాల్మీకి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా కావలి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్యదర్శులుగా వెంకటస్వామి, బాలస్వామి, బాలనారాయణ, లక్ష్మణ్, బాలచందర్, రాజు, రాముడు, కోశాధికారిగా గుడిసె నరసింహ, ప్రచార కార్యదర్శులుగా విష్ణు, మహేష్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సిర్సవాడలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నాగయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిర్సవాడ గ్రామ మాజీసర్పంచ్ లింగమ్మ, నాగయ్య, శ్రీశైలం, మల్లేష్, ప్రవీణ్‌కుమార్‌తోపాటు వారం రోజుల క్రితం బిజినేపల్లి మండలం మంగనూర్‌లో జేఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్న రాము ప్రమాదవశాత్తు మోటారు సైకిల్‌పై వెళ్తూ చెట్టుకు ఢీకొని తీవ్ర గాయాలై ఆసుపత్రిలో మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని సైతం పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు తిరుపతిరెడ్డి, సమద్‌పాషా, మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్‌తో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సిర్సవాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బిజినేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వేలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి పక్కనే రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. రెండేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా డివైడర్ నిర్మాణం చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించమని విద్యుత్ శాఖ అధికారులకు సూచించిన తొలగించకపోవడంతో అక్కడ వదిలేసి మిగతా రోడ్డు పూర్తి చేశాడు. రెండేళ్లైన ఇప్పటి వరకు విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎం ఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఎవరైనా అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే సీఎం ఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు నాయకులు ఉన్నారు.

ఆధునిక వైద్యసేవలు అందేలా చర్యలు



రోగులకు సర్జరీ చేస్తున్న ఎమ్మెల్యే, వైద్యులు

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రజలకు ఆధునిక వైద్య వేవలు అందించడమే నా చిరకాల స్వప్నమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మూడవ విడత మెగా సర్జికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలు పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియామకం చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేదుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అచ్చంపేట ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రి తలపించేలా అన్ని వసతులను కల్పిస్తానన్నారు. మూడవ మెగా సర్జికల్ క్యాంపునకు 570 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మొదటి 5 టేబుళ్లలో 72 శస్త్రచికిత్స చేశామన్నారు. మొదటి మెగా సర్జికల్ క్యాంపులో 1,236 మంది రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 762 మందికి ఆపరేషన్లు చేశామన్నారు. రెండవ విడతలో400 మంది చేశామన్నరు. ఈసారి అచ్చంపేట నియోజకవర్గమే కాకుండ కొల్లాపూర్ రంగారెడ్డి జిల్లాల నుంచి కూడా వైద్యం కోసం వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ ప్రభు, డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, డాక్టర్లు ప్రదీప్‌రాజ్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

- జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభించిన డాక్టర్ రమేష్‌చంద్ర



క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్‌చంద్ర

కల్వకుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణి స్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుం దని ప్రముఖ సర్జన్, డాక్టర్ రమేష్‌చంద్ర అన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయి. డాక్టర్ రమేష్‌చంద్ర ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 30, 31న మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ మైదానంలో జరిగే 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహ కులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు, సంయుక్త కార్యదర్శి పరశురామ్, ఉపాధ్యక్షులు భిక్షపతి, పీడీలు నిర్మల, సుభాషిణి, బాలాశ్రీ, జ్యోతి, బాలు,బాలయ్య, సబిత, పీఈటీలు రాణా మల్లేష్, రాజు, రాజేందర్, రమేష్, భానుప్రకాశ్, క్రీడాకారుల తల్లిదండ్రులు ఉన్నారు.

కేఎల్ఐ కాల్వకు అడ్డంకులు కలిగించొద్దు

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటినందించే కేఎల్ఐ కాల్వకు ఎవరూ అడ్డంకులు సృష్టించవద్దని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సం జీవ్‌కుమార్‌లు సూచించారు. ఆదివారం వారు వెల్దండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేఎల్ఐ కాల్వ ఈ ప్రాంత రైతులకు వరం లాం టిందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు సాగునీరందించే లక్ష్యంతో పని చేస్తున్నారని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని రావాలని కానీ తమంతటకు తామే కాల్వను ధ్వంసం చేసే పనికి పూనుకోవద్దని కోరారు. సమావేశంలో నాయకులు గోరటి శ్రీనివాస్, నారాయణ, శంకర్‌నాయక్, పుల్లయ్య, కాడురాం, రామకోటి తదితరులు ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



కల్వకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కల్వకుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుపర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ముందు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు నిరసనలో పాల్గొన్నారు. సీపీఎం జిల్లా నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం తక్షణమే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను ఆలస్యం చేయాలని ప్రభుత్వం చూస్తుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ మల్లయ్య, పరశురాములు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, పలువురు నాయకులు ఉన్నారు.

● బల్మూరు : కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్.దేశ్య నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో 42శాతం రిజర్వేషన్ బీసీల కు కల్పించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్‌నాయక్, మండల నాయకులు ఎండీ.లాల్ మహమ్మద్, మహేందర్, కృష్ణయ్య, బాబర్, ఆం జనేయులు, మాసయ్య, శ్రీరామ్, బాలు, రాజు, రజియాబేగం, లక్ష్మయ్య, గంగయ్య, నాగయ్య, బాలయ్య తదితరులు ఉన్నారు.

● వంగూరు : పార్లమెంటులో 42 శాతం బీసీ బిల్లును వెంటనే ఆమోదింపచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వంగూరులో సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్, పూలే విగ్రహాల వద్ద నిర్వహించిన నరసన కార్యక్రమంలో పర్వతాలు పాల్గొని మాట్లాడా రు. మండలంలోని పోతారెడ్డిపల్లి వద్ద ఇసుక అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాలస్వామి, శివరాములు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం తెలపాలని సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ ఆధ్వర్యంలో ఆదివారం కొల్లాపూర్‌లో నిరసన వ్యక్తం చేశారు.సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎండీ సలీం, బత్తిని రాజు, బాలు నాయక్ పాల్గొన్నారు.